సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 14 । అక్టోబర్ । 2023



విద్యార్థులు క్రీడల్లో రాణించాలి
జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను డీసీపీ రాజేశ్‌చంద్ర ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. - IIIలో



పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. - IIIలో



బతుకమ్మ వేడుకలు
విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. - IIIలో

న్యూస్‌రీల్

నిధులు స్వాహా చేసిన ఉద్యోగి సస్పెండ్

ఆలేరురూరల్ : ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిధులు స్వాహా చేసిన సీనియర్ అసిస్టెంట్ మెహర్‌బాబాపై సస్పెన్షన్ వేటు పడింది. వైద్యాధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు ఆడిట్ బృందం తన విచారణలో తేల్చింది. విచారణ నివేదికను వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు పంపగా మెహర్‌బాబాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీహెచ్‌ఎస్ చిన్న నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెహర్‌బాబా ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు.

భువనగిరి ఎంపీ టికెట్ భిక్షమయ్యగౌడ్‌కేనా?



కేటీఆర్‌కు మొక్క అందిస్తున్న భిక్షమయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి : బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను భువనగిరి ఎంపీగా ఆ పార్టీ అధిష్టానం రంగంలో దించనుందని సమాచారం. శుక్రవారం ప్రగతి భవన్‌లో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను భిక్షమయ్యగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భువనగిరి నుంచి ఎంపీగా పోటీ చేయాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం పాటుపడాలని భిక్షమయ్యను కేటీఆర్ కోరినట్లు తెలుస్తోంది.

కొండగడపవాసికి గోల్డ్ మెడల్



గవర్నర్ చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న దొండ స్వాతి

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన దొండ స్వాతి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఆమె గోల్డ్ మెడల్ అందుకున్నారు. పాటిమట్ల పాఠశాలలో చదివిన తనకు తెలుగు ఉపాధ్యాయుడు వీరాచారి ప్రోత్సాహం ఉందని స్వాతి తెలిపారు.

'మిషన్ ఇంద్రధనస్సు' పరిశీలన



కొరటికల్‌లో హెల్త్ సబ్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి

ఆత్మకూరు(ఎం): మండలంలోని కొరటికల్, పల్లెపహాడ్ సబ్ సెంటర్లను శుక్రవారం డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ చైతన్య సందర్శించారు. సబ్ సెంటర్ల పరిధిలో అమలు జరుగుతున్న మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకా తీసుకున్న గర్భిణులు, చిన్నారుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ మరియమ్మ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఏముల, అశ్విని, ఫరిజా, హేమలత పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ జిల్లా అధికారి, అదనపు డీసీపీ, ఏసీపీ

తుర్కపల్లి : మండలంలోని వాసాలమర్రి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును శుక్రవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ జిల్లా నోడల్ అధికారి సునంద, అదనపు డీసీపీ రవికుమార్, యాదగిరిగుట్ట ఏసీపీ శివరాంరెడ్డి సందర్శించారు. వాహన తనిఖీలను పరిశీలించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మద్యం, డబ్బు అక్రమంగా తరలించకుండా నిఘా ఉంచాలని, నిరంతర తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

నూతన కలెక్టర్‌గా హనుమంతు కొండిబా



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా

సాక్షి, యాదాద్రి : జిల్లా నూతన కలెక్టర్‌గా జెండగే హనుమంతు కొండిబా శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్‌గా ఉన్న ఆయనను.. ఎన్నికల కమిషన్ జిల్లాకు బదిలీ చేసింది. 2015 బ్యాచ్‌కు చెందిన హనుమంతు కొండిబా తొలిసారిగా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ వీరారెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌కు అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, అడిషనల్ డీసీపీ రవికుమార్, ఆర్డీఓ అమరేందర్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శివరామిరెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు స్వాగతం పలికారు.

సూర్యాపేట ఎస్పీగా రాహుల్ హెగ్డే



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ బీకే రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: సూర్యాపేట నూతన ఎస్పీగా బీకే రాహుల్ హెగ్డేను నియమిస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్పీకి అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, మహేష్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

- కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా


సాక్షి, యాదాద్రి : ఎన్నికల విధులపై నోడల్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా సూచించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాన్ఫరెన్స్‌లో హాల్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం అయ్యారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సువిధ ద్వారా క్రమ పద్ధతిలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కరరావు, అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

యూత్ ఓట్లే కీలకం!

గెలుపోటములను ప్రభావితం చేసేది వారే..

- యువతపైనే ప్రత్యేక దృష్టి సారించిన అన్ని రాజకీయ పార్టీలు
- ఇప్పటికే ఇన్‌చార్జిలను నియమించిన బీఆర్‌ఎస్
- నిరుద్యోగులను ఆకర్శించేలా కాంగ్రెస్, బీజేపీ ఎత్తులు

18 నుంచి 19 ఏళ్ల	20 నుంచి 29 ఏళ్ల	30 నుంచి 39 ఏళ్ల
ఓటర్లు 93,955	ఓటర్లు 5,65,916	ఓటర్లు 8,05,693



సాక్షి ప్రతినిధి నల్లగొండ, సాక్షి యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో యువత ఓట్లు కీలకం కాబోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న మొత్తం ఓటర్లలో 18 ఏళ్ల నుంచి 39 వారే సగానికంటే ఎక్కువమంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల భవిత ఈ యువ ఓటర్లపైనే ఆధారపడి ఉంది. దీంతో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారి నుంచి మొదలుకొని 39 ఏళ్లలోపు ఉన్న వారిపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను వారే ప్రభావితం చేయనుండడంతో వారిని ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. 40 ఏళ్ల పైబడిన వారు ఎలాగూ ఓ కచ్చితమైన అభిప్రాయంతో ఉంటారనే అంచనాతో 40 ఏళ్లకంటే తక్కువ వయస్సు ఉన్న వారిపైనే ప్రత్యేక ఫోకస్ పెట్టాయి.

జిల్లాల వారీగా యూత్ ఓట్లు ఇలా..

◆ నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 14,26,480 మంది ఓటర్లు ఉన్నారు. అందులో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న 18–19 ఏళ్ల వారు 48,909 మంది ఉండగా, 20 నుంచి 29 ఏళ్ల వారు 2,91,768 మంది ఉన్నారు. అంటే 29 ఏళ్లలోపు ఉన్న ఓటర్లే జిల్లాలో 3,40,677 మంది (23.89 శాతం) ఉన్నారు. ఇక 30 నుంచి 39 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 4,10,842 మంది ఉన్నారు. ఈ రెండు కేటగిరీలు కలిపితే 7,51,519 మంది (52.69 శాతం) ఓటర్లు వీరే ఉన్నారు.

◆ సూర్యాపేట జిల్లాలో 9,63,701 మంది ఓటర్లు ఉండగా.. 18 నుంచి 39 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లు 4,89,118 మంది ఉన్నారు. జిల్లా ఓటర్లలో 50.75 శాతం వీరే ఉన్నారు.

◆ యాదాద్రి జిల్లాలోని భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 4,39,100 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18 నుంచి 29 ఏళ్లలోపు ఓటర్లు 1,02,159 మంది ఉన్నారు. వీరిలో కొత్త ఓటర్లు 14,512 మంది ఉన్నారు. 30 నుంచి 39 ఏళ్లలోపు వారు 1,22,738 మంది ఉన్నారు. జిల్లాలో 39 ఏళ్ల లోపు వారు మొత్తం 2,24,897 (51.21 శాతం) మంది ఉన్నారు.

బీఆర్‌ఎస్.. వంద మందికి ఒక ఇన్‌చార్జి

క్షేత్రస్థాయిలో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నిత్యం వారికి అందుబాటులో ఉండేందుకు బీఆర్‌ఎస్ ఇప్పటికే ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని క్షేత్రస్థాయిలోకి పంపించింది. ముఖ్యంగా వారు కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి తమవైపు తిప్పుకునే కార్యాచరణను అమలు చేస్తున్నారు.

నిరుద్యోగులను ఆకర్షించేలా..

ఉద్యోగాలు రాక, వచ్చినా నోటిఫికేషన్లు వాయిదా పడి తీవ్ర నిరాశలో ఉన్న నిరుద్యోగులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ అడుగులు వేస్తున్నాయి. నియోజకవర్గాల్లో తమ టికెట్ కన్‌ఫర్మ్ అనుకున్న అభ్యర్థులు వారిపై ప్రత్యేక దృష్టి సారించేలా తమ బృందాలను రంగంలోకి దింపారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

వయస్సు వారీగా యువ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	18-19	20-29	30-39
నల్లగొండ	8,254	47,647	66,915
నకిరేకల్	7,531	47,604	71,180
నాగార్జునసాగర్	7,865	46,193	67,259
మిర్యాలగూడ	6,952	45,635	65,656
దేవరకొండ	7,555	52,282	71,883
మునుగోడు	10,752	52,407	67,949
హుజూర్‌నగర్	7,287	44,301	65,454
కోదాడ	8,394	47,092	71,535
సూర్యాపేట	7,465	46,886	66,065
తుంగతుర్తి	7,388	48,222	69,059
భువనగిరి	7,338	42,750	59,531
ఆలేరు	7,174	44,897	63,207

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

- రైతులకు అవగాహన కల్పించాలి
- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : కొనుగోలు కేంద్రాలకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు (రెవెన్యూ) అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో వ్యవసాయ అధికారులు, ప్యాక్స్ సెంటర్ల కార్యదర్శులు, ఏపీఎంలు, ట్యాబ్ ఆపరేటర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మార్కెటింగ్ రీసోర్స్ పర్సన్లు, ఐకేపీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఈఓలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు సర్టిఫికెట్‌లు ఇవ్వాలన్నారు. తేమ 17 శాతానికి మించరాదన్నారు. గన్నీ బ్యాగులు, తూకం, తేమ యంత్రాలను సమకూర్చుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, విద్యుత్, మంచినీరు, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హమాలీలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈసారి బయోమెట్రిక్ ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారని, నూతన విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు, బయోమెట్రిక్, డేటా కలెక్షన్, రైతుల ఖాతాల్లో నగదు జమ వివరాలను ఏరోజుకారోజు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, రవాణా శాఖ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి, వేదికపై కసిరెడ్డి నారాయణరెడ్డి, తడక వెంకటేశం, నాయకులు

- డీసీసీ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12కు 12 స్థానాలు గెలుచుకుంటామని, రాష్ట్రంలో 70కి పైగా సీట్లు వస్తాయని, ఇదే విషయాన్ని సర్వేలు కూడా చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల వల్లే బీబీనగర్ ఎయిమ్స్ వచ్చిందన్నారు. భువనగిరి నియోజకవర్గంలో సాగునీటి కాల్వలు, జూలూరు – రుద్రవెల్లి మధ్య మూసీపై వంతెన, భూదాన్‌పోచంపల్లిలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటులో ఎమ్మెల్యే విఫలం చెందారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను గడపగడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు.

ఆలయంలో పూజలు, ర్యాలీ

కట్టమైసమ్మ దేవాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి అనిల్‌కుమార్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం బాలాజీ ఫంక్షన్‌హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి తంగెళ్లపల్లి రవికుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల, పట్టణ అధ్యక్షులు పాక మల్లేశ్‌యాదవ్, భారత లవకుమార్, మర్రి నర్సింహారెడ్డి, సామ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు భోగ భానుమతివిష్ణు, మోటె రజితరాజు, గునిగంటి రమేశ్, సర్పంచులు బొడిగె శంకరయ్య, లింగస్వామి, దోర్నాల సృజన, నాయకులు మన్నె వెంకట్‌రెడ్డి, బండారు ప్రకాశ్‌రెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, కాసుల అంజయ్య, కీర్తి సంజీవ, కుక్క కుమార్, మక్తాల రమేశ్, మెరుగు శశికళ, జింకల కుమార్, జయసూర్య, వాకిటి జంగారెడ్డి, రావుల అనిల్, సందీప్, దాసర్ల జంగయ్య, పడాల సతీష్‌చారి పాల్గొన్నారు.

పోచంపల్లి బ్యాంకుకు జాతీయ అవార్డులు



అవార్డు అందుకుంటున్న బ్యాంక్ చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు 2022– 23 ఆర్థిక సంవత్సరానికి గాను రెండు జాతీయ అవార్డులు దక్కాయి. రూ.750 కోట్ల డిపాజిట్లు సేకరించినందుకు గాను ఉత్తమ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, ఉత్తమ ఇ–పేమెంట్ ఇన్షియేటివ్ అవార్డులు వచ్చినట్లు బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం, సీఈఓ సీత శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈనెల 12న గోవాలో జరిగిన జాతీయ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనంలో రిజర్వ్ బ్యాంకు మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ రత్నాకర్ దేవ్లే చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ఎల్‌బీనగర్, హయత్‌నగర్‌లో కొత్త శాఖలు

పోచంపల్లి బ్యాంక్‌కు ఏటా జాతీయస్థాయిలో అవార్డులు రావడానికి ఖాతాదారులు బ్యాంక్‌పై కనబర్చిన విశ్వాసం, మెరుగైన సేవలే కారణమని బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం, సీఈఓ సీత శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 18వ తేదీన ఎల్‌బీనగర్, నవంబర్‌లో హయత్‌నగర్‌లో బ్యాంకు నూతన శాఖలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సూరెపల్లి రమేశ్, డైరెక్టర్లు సీత దామోదర్, భోగ విజయ్‌కుమార్, చిక్క కృష్ణ, పున్న లక్ష్మీనారాయణ, ఎల్లస్వామి, కవిత, అర్చన, రాపోలు వేణు, బిట్టు భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు

భువనగిరి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 16న సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. పార్టీ నాయకులతో చర్చించి సూచనలు చేశారు. ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.



సభా ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

దసరాకు ఆర్టీసీ 'స్పెషల్'!

- అదనపు బస్సులు నడవనున్న సంస్థ
- ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఏడు రోజుల పాటు ప్రత్యేక సర్వీసులు
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 409 బస్సులతో షెడ్యూల్
- చార్జీలు సాధారణమే.. ప్రయాణికులకు కానుకలు



నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సెక్కుతున్న ప్రయాణికులు

డిపోల పరిధిలో నడపనున్న బస్సులు

డిపో	బస్సులు
నల్లగొండ	79
నార్కట్‌పల్లి	16
మిర్యాలగూడ	65
దేవరకొండ	70
సూర్యాపేట	75
కోదాడ	73
యాదగిరిగుట్ట	31
మొత్తం	409

నల్లగొండ రూరల్, భానుపురి (సూర్యాపేట) : తెలంగాణలో అతిపెద్ద పండుగ అయిన దసరాకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏటా స్పెషల్ బస్సులు నడుపుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులతో మంచి ఆదాయాన్ని అర్జిస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు, తిరిగి 19 నుంచి 22వ తేదీ వరకు నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 409 బస్సులను నడపాలని అధికారులు నిర్ణయించారు. గతేడాది మాదిరిగానే ఈ ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నారు. ఇక ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నియామకం తర్వాత వినూత్న కార్యక్రమాలతో ముందుకు వస్తుండగా.. రాఖీ సందర్భంగా సత్ఫలితాలు ఇచ్చిన గిఫ్ట్‌ల కార్యక్రమాన్ని ఈ పండుగకు ప్రవేశ పెట్టనున్నారు. 10 మందికి రూ.9,900 చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నారు.

రద్దీ రోజులను గుర్తించి..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా నల్లగొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, కోదాడ, సూర్యాపేట, యాదగిరిగుట్ట మొత్తం ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లావాసులు ఉద్యోగాలు, ఇతర పనులు, విద్య కోసం రాజధాని హైదరాబాద్‌లోనే అధికంగా ఉంటుంటారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ఉండడం, బతుకమ్మ, దసరా అతి పెద్ద పండుగలు కావడంతో పెద్ద ఎత్తున జనం సొంత గ్రామాలకు తరలి వస్తుంటారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి ఆయా డిపోలకు వచ్చే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. మొదట్లో విద్యాసంస్థలకు సెలవు ఉండడంతో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు, తర్వాత సాధారణ జనం రద్దీ కారణంగా 19నుంచి 22వ తేదీ వరకు.. ఇలా మొత్తంగా ఏడు రోజుల పాటు ప్రయాణికుల రద్దీ ఉంటుందని భావించి ఆయా తేదీల్లో రాజధానికి అదనపు బస్సులు నడపనున్నారు.

10 మంది ప్రయాణికులకు గిఫ్ట్‌లు

ప్రయాణికుల ఆదరణ పొందడం.. తద్వారా మంచి ఆదాయాన్ని గడించేందుకు వినూత్న కార్యక్రమాలతో ఆర్టీసీ ముందుకు వస్తోంది. రాఖీ సందర్భంగా చేపట్టిన బహుమతుల పథకానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన రావడంతో ఈ దసరాకు కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నారు. పండుగకు ముందు ఈనెల 21 నుంచి 23 వరకు, పండుగ తర్వాత 28నుంచి 30వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు తమ టికెట్ వెనుక పేరు, ఫోన్‌నంబర్ రాసి.. ఆర్టీసీ ఏర్పాటు చేసే బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. ఈ బాక్సులను నల్లగొండ, దేవరకొండ, చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, కొండమల్లేపల్లి, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట హైటెక్ బస్టాండ్, కొత్తబస్టాండ్, యాదగిరిగుట్ట కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, భువనగిరి బస్టాండ్లలో ఏర్పాటు చేయనున్నారు.

409 బస్సులు.. సాధారణ చార్జీలు

పండుగ నేపథ్యంలో ఆర్టీసీ నల్లగొండ రీజియన్ పరిధిలో మొత్తం 409 బస్సులతో అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. మొదటిరోజు శుక్రవారం ఏడు డిపోల నుంచి 56 బస్సులను నడిపారు. ఇక 14వ తేదీన 36 బస్సులు నడపనున్నారు. 15వ తేదీన 35 బస్సులు తిప్పుతారు. తిరిగి ఈనెల 19న 71 బస్సులు, 20వ తేదీన 56 బస్సులు, 21వ తేదీన 75 బస్సులు, 22వ తేదీన 80 బస్సులు నడపనున్నారు. అయితే గతంలో స్పెషల్ బస్సులను నడిపితే 20 శాతం మేర చార్జీలు అదనంగా వసూలు చేసేవారు. 2022లో బస్ చార్జీలు రెండుసార్లు పెంచడం, చిల్లర సమస్యతో మరోసారి పెంచడంతో గతేడాది దసరా స్పెషల్ బస్సులకు చార్జీలను పెంచలేదు. ఈ సారి కూడా రోజువారీగా వసూలు చేసే చార్జీలనే తీసుకోనున్నారు.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



బతుకమ్మ, దసరా పండుగకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నల్లగొండ రీజియన్ పరిధిలో 409 ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికులు స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికుల రద్దీని బట్టి ఇంకా అదనంగా సర్వీసులు నడుపుతాం. ఈ పండుగకు నగదు బహుమతులు అందిస్తున్నాం.

– ఎస్.శ్రీదేవి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్లగొండ

ఎర్రజెండా నుంచి గులాబీ దాకా..!

విలక్షణ తీర్పునిచ్చిన సూర్యాపేట ఓటర్లు

- కమ్యూనిస్టులకు, కాంగ్రెస్, టీడీపీకి ఆదరణ
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్‌కు పట్టం
- ఇక్కడి నుంచి మంత్రులుగా పనిచేసిన దామోదర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి




ఉప్పల మల్సూర్


ధర్మభిక్షం


గోపాల్


సుదర్శన్


వెంకయ్య


దామోదర్‌రెడ్డి


జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు ఘన చరిత్ర సూర్యాపేట సొంతం. ఈ నియోజకవర్గ ఓటర్లు బీజేపీ మినహా అన్ని పార్టీలను ఆదరించారు. 1952లో నియోజకవర్గ ఏర్పాటులో అప్పటి రైతాంగ పోరాటంలో ప్రత్యేక గుర్తుంపు పొందిన ప్రాంతంగా పేరు పొందిన సూర్యాపేటలో వరుసగా నాలుగుసార్లు పీడీఎఫ్‌ను ఆదరించారు. ఒకసారి సీపీఐని గెలిపించారు. మరోసారి సీపీఎంను గెలిపించి కమ్యూనిస్టుల కంచుకోట సూర్యాపేట అనేలా తీర్పునిచ్చారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో రెండు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కట్టారు. 1983 తరువాత రాజకీయాల్లో వచ్చిన మార్పుల వల్ల వరుసగా నాలుగుసార్లు టీడీపీని గెలిపించారు. టీడీపీ పట్టుకోల్పోవడంతో తిరిగి మూడుసార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించారు.

నాలుగుసార్లు గెలిచిన ఉప్పల మల్సూర్

- ఈ ప్రాంతంలో తెలంగాణ వాదం బలంగా ఉండడంతో గత రెండు ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ గెలిచింది. 2014,2918లో గెలుపొందిన జగదీష్ రెడ్డి.. రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.
- 1952లో ద్విసభ్య నియోజకవర్గం నుంచి గెలిచిన ధర్మభిక్షం తర్వాత నకిరేకల్‌లో 1957, నల్లగొండలో 1962లో గెలిచారు.
- కడవరకు సాధారణ జీవితం గడిపిన మల్సూర్‌ను పేట ఓటర్లు నాలుగుసార్లు గెలిపించారు.

ప్రస్తుతం ఓటర్లు ఇలా..

సూర్యాపేట నియోజకవర్గంలో 271 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,35,221 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,15,628 మంది పురుషులు, 1,19,576 మంది మహిళా ఓటర్లు, 17 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. సూర్యాపేట రూరల్ పరిధిలో 42,583 మంది ఓటర్లు ఉండగా, మున్సిపాలిటీ పరిధిలో 78,424 మంది ఓటర్లు, పెన్‌పహాడ్ మండలంలో 32,472 మంది ఓటర్లు, చివ్వెంల మండలంలో 40,257 మంది, ఆత్మకూర్(ఎస్) మండలంలో 41,485 మంది ఓటర్లు ఉన్నారు.

సూర్యాపేట నుంచి ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ
1952	ఉప్పల మల్సూర్	పీడీఎఫ్	జె.పి సర్వేష్	కాంగ్రెస్
1952 (ద్వి)	బి. ధర్మబిక్షం	పీడీఎఫ్	జి.ఏ.రెడ్డి	కాంగ్రెస్
1957	ఉప్పల మల్సూర్	పీడీఎఫ్	ఇ.గోపయ్య	కాంగ్రెస్
1957(ద్వి)	భీంరెడ్డి నర్సింహారెడ్డి	పీడీఎఫ్	ఆర్ఆర్.రావు	కాంగ్రెస్
1962	ఉప్పల మల్సూర్	సీపీఐ	గోపయ్య	కాంగ్రెస్
1967	ఉప్పల మల్సూర్	సీపీఎం	మారపంగు మైసయ్య	కాంగ్రెస్
1972	యడ్ల గోపయ్య	కాంగ్రెస్	కె.ఎల్లయ్య	సీపీఎం
1978	ఎ. వరందాములు	కాంగ్రెస్.ఐ	ఎం.మైసయ్య	జనతాపార్టీ
1983	ఈద దేవయ్య	టీడీపీ	బిఎం.రాజు	కాంగ్రెస్
1985	డి.సుందరయ్య	టీడీపీ	ఎ.వరందాములు	కాంగ్రెస్
1989	ఆకారపు సుదర్శన్	టీడీపీ	ఈద దేవయ్య	కాంగ్రెస్
1994	ఆకారపు సుదర్శన్	టీడీపీ	జె.ఎల్లయ్య	కాంగ్రెస్
1999	దోసపాటి గోపాల్	కాంగ్రెస్	ఆకారపు సుదర్శన్	టీడీపీ
2004	వేదాసు వెంకయ్య	కాంగ్రెస్	పి.రజనీకుమారి	టీడీపీ
2009	ఆర్.దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్	పొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి	టీఆర్ఎస్
2014	జి.జగదీష్‌రెడ్డి	టీఆర్ఎస్	సంకినేని వెంకటేశ్వర్‌రావు	ఇండిపెండెంట్
2018	జి.జగదీష్‌రెడ్డి	టీఆర్ఎస్	రాంరెడ్డి దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్

ఎన్నికల ఖర్చుపై 20 శాఖలతో నిఘా



చిట్యాల: శాసనసభ ఎన్నికల్లో అంతకంతకు పెరిగిపోతున్న అభ్యర్థుల ఖర్చును నియంత్రించేందుకుగాను కేంద్ర ఎన్నికల సంఘం ఇరవై ప్రభుత్వ శాఖలతో నిఘా ఏర్పాటు చేసింది. ఈ ఇరవై ప్రభుత్వ శాఖల్లో ఈడీ, ఐటీ, రెవెన్యూ, ఇంటలిజెన్స్, జీఎస్టీ, పోలీస్, కస్టమ్స్, ఎక్సైజ్, సీఐఎస్ఎఫ్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, సివిల్ ఏవియేషన్, పోస్టల్, ఆర్‌బీఐ, ఎస్ఎల్‌బీసీ, ఎన్‌సీబీ, రైల్వే, ఫారెస్ట్, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్స్ పనిచేయనున్నాయి. ఈ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పూర్తి సమాచారాన్ని అందిపుచ్చుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. అంతేకాకుండా విమాన ఖర్చులపై కూడా నిఘా ఉంచనున్నారు. అక్రమంగా మద్యం రవాణ చేసినట్లుయితే లిక్కర్ కింగ్ పిన్స్, లిక్కర్ డిస్ట్రిబ్యూటర్స్‌పై చర్యలను తీసుకుంటారు. అంతేకాకుండా శాసనసభ నియోజకవర్గాల సరిహద్దులు, రాష్ట్రాల సరిహద్దుల గుండా మద్యం, నగదు, డ్రగ్స్, ఉచితంగా అందించే వివిధ రకాల వస్తువులు, ఆభరణాలు రవాణా కాకుండా సైతం అధికారులు పూర్తి స్థాయిలో నిఘా ఉంచనున్నారు.

ఎమ్మెల్యేలయ్యారు.. ఎంపీలూ అయ్యారు!

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొందరు నాయకులు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా విజయం సాధించి పదవులకు వన్నె తెచ్చారు. ఏ పదవిలో ఉన్నా తమను ఎన్నుకున్న ప్రజలకు సేవే లక్ష్యంగా ముందుకు సాగారు. కొందరు నాయకులు ముందు ఎమ్మెల్యేగా, ఆ తర్వాత ఎంపీలుగా గెలిచారు. మరికొందరు ముందు ఎంపీగా, ఆ తర్వాత ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా విజయం సాధించారు. రావి నారాయణరెడ్డి మాత్రం తొలి ఎన్నికల్లోనే ఎంపీగా, ఎమ్మెల్యేగా విజయం సాధించి రికార్డు సృష్టించారు

– సాక్షి, యాదాద్రి



- **రావి నారాయణరెడ్డి :** 1952 ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున భువనగిరి ఆసెంబ్లీ, నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి రావి నారాయణరెడ్డి రెండు చోట్ల విజయం సాధించారు. ఆ వెంటనే భువనగిరి ఆసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసి ఎంపీగా కొనసాగారు. అనంతరం 1957లో భువనగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962లో మరోసారి నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. మొదటిసారి ఎంపీగా గెలిచినప్పుడు దేశంలో అత్యధిక మెజార్టీ సాధించడంతో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రావి నారాయణరెడ్డికి ప్రత్యేకంగా స్వాగతం పలికారు. పార్లమెంట్ నూతన భవనాన్ని రావినారాయణరెడ్డి చేత ప్రారంభించారు.

- **బొమ్మగాని ధర్మభిక్షం :** సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1952లో ఎమ్మెల్యేగా గెలిచిన ధర్మభిక్షం, 1962లో నల్లగొండ నుంచి, 1967లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1991, 1996లో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. పేదవర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడే నాయకునిగా ఆయనకు జనం మదిలో నిలిచిపోయారు.

- **భీంరెడ్డి నర్సింహారెడ్డి :** 1957లో సూర్యాపేట, 1967లో తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన భీంరెడ్డి నర్సింహారెడ్డి.. 1984, 1991లో రెండు సార్లు మిర్యాలగూడ ఎంపీగా ఎన్నికయ్యారు. పీడిత ప్రజల సమస్యలు, భూపోరాటలతో ఆయన జీవితం ప్రజాసేవకే అంకితమైంది.

- **చకిలం శ్రీనివాసరావు :** నల్లగొండ జిల్లా రాజకీయాల్లో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన చకిలం శ్రీనివాసరావు 1967, 1972 నల్లగొండ నుంచి రెండు సార్లు, 1983లో మిర్యాలగూడెం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989లో నల్లగొండ ఎంపీగా గెలుపొందారు.

- **ఎం.రఘుమారెడ్డి :** టీడీపీ ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చిన మల్‌రెడ్డి రఘుమారెడ్డి 1984లో నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. అనంతరం 1989లో నల్లగొండ ఎమ్మెల్యేగా గెలిచారు. తెలుగుదేశం ప్రభంజనంలో గెలిచిన ఆయన ప్రజలకు చేరువయ్యారు.

- **రవీంద్రనాయక్ :** గిరిజన నాయకుడు రవీంద్రనాయక్ 1978, 1983లో దేవరకొండ ఎమ్మెల్యేగా గెలిచారు. భవనం వెంకట్‌రామ్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. ఈయన కొంతకాలం క్రియాశీలక రాజకీయలకు దూరంగా ఉన్నారు. 2004లో వరంగల్ ఎంపీగా టీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందారు.

- **కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి :** నల్లగొండ ఎమ్మెల్యేగా నాలుగు సార్లు విజయం సాధించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. దీంతో ఆ వెంటనే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

- **ఉత్తమ్‌కుమార్‌రెడ్డి :** కోదాడ, హుజూర్‌నగర్‌ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేసిన కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి ఎంపీగా విజయం సాధించారు.

- **పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి :** మునుగోడు నియోజకవర్గం నుంచి ఐదు సార్లు 1967, 1972, 1978, 1983, 1999లో ఎమ్మెల్యేగా గెలిచిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి రాజ్యసభ సభ్యునిగా కూడా పనిచేశారు. 2009 ఎన్నికల్లో ఆయన మునుగోడు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.

- **కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి :** 2009లో భువనగిరి పార్లమెంట్ సభ్యునిగా కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, 2014లో జరిగిన ఎన్నికలో ఎంపీగా ఓటమి పాలయ్యారు. అనంతరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2018లో జరిగిన శాసన సభఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2022లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా.. ఉప ఎన్నిక వచ్చింది. ఉప ఎన్నికలో ఆయన బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సూర్యాపేట జిల్లా కలెక్టర్
- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహణ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె, పట్టణ ప్రకృతి వనాలతో పాటు, రోడ్లకు, కాలువలకు ఇరువైపులా నాటిన మొక్కలు చనిపోతున్నాయని గ్రహించిన సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు కూడా నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు చాలా ముఖ్యమైనదని అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని భావించి రెండు అంశాలను ఉద్దేశించి 'నీరుపోసి మొక్కను బతికించుకుందాం.. ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం ' అనే నినాదంతో ఈ కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం నేటి నుంచి ఈనెల 20వ రకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాలను కలెక్టర్ వెంకట్రావు సూర్యాపేట మున్సిపాలిటీలో నేడు (శనివారం) ఉదయం 8గంటలకు ప్రారంభించనున్నారు. అదే విధంగా సూర్యాపేట రూరల్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, తుంగతుర్తిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకట్‌రెడ్డి, హుజూర్‌నగర్‌లో స్థానిక ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఆత్మకూర్ (ఎస్)లో సూర్యాపేట ఆర్డీఓ వీరబ్రహ్మచారి, కోదాడలో స్థానిక ఆర్డీఓ సూర్యానారాయణ ప్రారంభించనున్నారు.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు విలు వను తెలుపుతూ అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నిర్వహించే 'నీరుపోసి మొక్కను బతికించుకుందాం–ఓటు వేసి ప్రజావామ్యాన్ని కాపాడుకుందాం' కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి. వర్షాలు లేకపోవడంతో మొక్కలు ఎండి చనిపోతున్నాయని అందుకే వారం రోజులు మొక్కలకు నీటిని అందించే కార్యక్రమం చేపట్టాం. ఇందులో భాగంగానే ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తాము. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలి.

– వెంకట్రావు, కలెక్టర్, సూర్యాపేట

వారం రోజుల ప్రణాళిక..

ఈ కార్యక్రమాన్ని వారం రోజులు జిల్లాలోని ప్రతి పల్లె, పట్టణంలో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి జిల్లా అధికారితో పాటు మండల, గ్రామ అధికారులు కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ప్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాలు, ప్లకార్డులను వినియోగించనున్నారు. గ్రామాల్లో ఉద్యోగులతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలచే ర్యాలీగా పల్లె ప్రకృతి వనాలు చేరేలా ప్రణాళిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అందరూ పాల్గొననున్నారు.

స్కూటీ ఢిక్కీలో నుంచి నగదు అపహరణ

మోత్కూరు : గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తి స్కూటీ ఢిక్కీలో నుంచి రూ.57వేల నగదును అపహరించారు. ఈ సంఘటన మున్సిపల్ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు పట్టణానికి చెందిన బొర్ర విజయ్‌కుమార్ తన తండ్రి పద్మయ్య పేరు మీద ఉన్న ఇంటిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రూ.57వేల నగదుతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను స్కూటీ ఢిక్కీలో పెట్టుకొని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చాడు. ఈ క్రమంలో తన వాహనాన్ని ఓ డాక్యుమెంటరీ దుకాణం ఎదుట నిలిపి బాండ్ పేపర్ కోసం వెళ్లి వచ్చే సరికి ఢిక్కీలోని రూ.57వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రాజాపేట : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జాల గ్రామం శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మంతూరుకు చెందిన జీడిపల్లి వెంకట్‌రెడ్డి తన బంధువైన మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన బూత్కూరు నర్సిరెడ్డి ఇంటికి వచ్చాడు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా జాల – సింగారం గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న లేగదూడను తన వాహనంతో ఢీకొట్టాడు. వెంకట్‌రెడ్డి తీవ్రగాయాలై రోడ్డుపై పడడంతో గమనించిన ప్రయాణికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

200 కిలోల గంజాయి పట్టివేత

- ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు రవాణా
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- గంజాయి, క్రెటా కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం


పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న సీపీ దేవేంద్రసింగ్‌చౌహాన్

చౌటుప్పల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మహారాష్ట్రలోని పూణే ప్రాంతానికి కారులో తరలిస్తున్న 200కిలోల గంజాయిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులతో పాటు మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ పోలీస్ కమీషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహారాష్ట్రలోని పూణే జిల్లా కందలి గ్రామానికి చెందిన సందీప్‌అనిల్ ఇంద్రేకర్(37) చిన్న వ్యాపారాలు చేసేవాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో అక్రమంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో డ్రైవర్‌గా పనిచేసే తన గ్రామానికే చెందిన చిన్ననాటి స్నేహితుడు విశాల్ కందుగడ్డి(36)ని సంప్రదించాడు. అతడు అంగీకరించడంతో వీరిద్దరికి స్నేహితుడైన మరో వ్యక్తి ద్వారా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా పప్పులూరు గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో డీల్ కుదుర్చుకున్నారు. అనంతరం లక్ష్మణ్ ఓ క్రెటా కారును కొనుగోలు చేశాడు. అంతా కలిసి గంజాయి రావాణా ప్రారంభించారు. రవాణా చేసే సమయంలో పోలీసులు తనిఖీలు చేయకుండా కారు డ్యాష్‌బోర్డు మీద మహారాష్ట్రలోని ఓ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ పేరిట తలటోపి ఉంచేవారు. అందులో భాగంగా గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి ప్రాంతంలో 200కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. దాన్ని 98ప్యాకెట్లుగా మార్చి కారులో భద్రపర్చారు. ఆ క్రమంలో పక్కా సమాచారం రావడంతో చౌటుప్పల్ పోలీసులతో పాటు మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. గంజాయి రవాణా చేస్తున్న క్రెటా కారును గుర్తించారు. కారులో ఉన్న సందీప్‌అనిల్ ఇంద్రేకర్, విశాల్‌కందుగడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. కారుతో పాటు రెండు వందల కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ నిమిత్తం నల్లగొండ జైలుకు తరలించారు. పట్టుబడిన గంజాయి, సామాగ్రి విలువ 70లక్షలుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్–మహేశ్వరం ఎస్‌వోటీ డీసీపీ కె.మురళీధర్, చౌటుప్పల్ ఏసీపీ వై.మొగిలయ్య, సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింహారావు (ఫైల్)

పెద్దవూర : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పోతునూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెండ్యాల నర్సింహారావు(67) తన పొలంలోని బోర్ మోటారుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసి ఆ ట్రాన్స్‌ఫార్మర్ పైన ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎక్కాడు. తీగలను మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో చేతులు, కాళ్లు, చాతిభాగంలో తీవ్రంగా కాలిన గాయాలతో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాలిన వాసన వస్తుండటంతో సమీప పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు గమనించి వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

చిట్యాల : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చిట్యాల ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం పామనగుండ్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బండారు శోభన్ బాబు(36) చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామం నుంచి ట్రాక్టర్‌లో కట్టెల లోడ్‌తో జనగామకు గురువారం సాయంత్రం వెళ్లాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని వట్టిమర్తి స్టేజీ వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ ట్యాంకర్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శోభన్‌బాబు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. కాగా శోభన్‌బాబు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

మునుగోడు : ఆధారాలు లేకుండా కారులో నగదు తీసుకెళ్తున్న ఓ యువకుడి నుంచి రూ.2లక్షలను శనివారం మునుగోడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన వేముల ప్రశాంత్‌రెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలోని తమ బంధువుల ఇంటి నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో రూ.2లక్షల నగదు తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు తెలిపారు.

నాంపల్లిలో రూ.3.49లక్షలు..

నాంపల్లి : మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ నుంచి బైక్‌పై నగదు తీసుకెళ్తుండగా శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అతడి వద్ద రూ.3లక్షల 49వేల నగదు గుర్తించి పట్టుకున్నారు. నగదుకు సీజ్ చేసినట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

కొండమల్లేపల్లి : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలోనే పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పాయింట్ వద్ద శుక్రవారం రూ.94500 నగదును పట్టుకున్నారు. పెండ్లిపాకల గ్రామానికి చెందిన పేర్ల హైమావతి బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకొని తన భర్తతో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆమె వద్ద నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లికి వస్తున్న వికాస్ గంగోపాధ్యాయ వద్ద ఉన్న రూ.84,500 నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రూ.2.45 లక్షలు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్న వ్యక్తి నుంచి వన్‌టౌన్ పోలీసులు రూ 2.45లక్షలు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఏపీ రాష్ట్రం బాపట్ల జిల్లా ఇంకోలుకు చెందిన వేణు తన కారులో తీసుకెళ్తున్న డబ్బులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

రూ.90వేల నగదు పట్టివేత

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.90వేలను సీజ్ చేసినట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. మాడ్గుల మండలానికి చెందిన ఎరుకల వెంకటేశ్ రూ.90వేలతో చింతపల్లి వైపునకు వస్తుండగా వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శాలిగౌరారం మండలంలో రూ.2.26లక్షలు..

శాలిగౌరారం : మండలంలోని వంగమర్తి సమీపంలో ఎస్ఐ సతీష్ నేతృత్వంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేశారు. ఈ క్రమంలో గొర్రెల కొనుగోలు వ్యాపారం నిర్వహించే వరంగల్ జిల్లా గొల్లపల్లి మండలం చంద్రుగొండ గ్రామానికి చెందిన మైల కుమారస్వామి, వీరమల్ల శ్రీను వంగమర్తి నుంచి నకిరేకల్ వైపు మినీ ట్రక్కులో వెళ్తుండగా వారివద్ద ఉన్న రూ.1.40 లక్షల నగదు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన దేవులపల్లి రామచందర్ రావు కారులో ప్రయాణిస్తుండగా కారులో ఉన్న రూ. 86 వేలను సీజ్ చేశారు.

కనగల్ : నల్లగొండ నుంచి గుర్రంపోడ్ వైపు వెళ్తున్న వాహనాన్ని మండల కేంద్రంలో పట్టుకుని రూ.98,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. నల్లగొండకు చెందిన మహమ్మద్ ఖలీమ్ ఉద్దీన్ నగదుగా గుర్తించారు. నగదును నల్లగొండ డీటీఓ కార్యాలయంలో అప్పగించినట్లు తెలిపారు.

మహిళల నుంచి రూ.9.90లక్షలు స్వాధీనం

నాగారం : సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగారం ఎక్స్‌రోడ్డు సమీపంలో డి.కొత్తపల్లి ఆవాసం బీమ్లాతండాకు చెందిన ఇద్దరు మహిళలు హ్యాండ్ బ్యాగులు వేసుకొని అనుమానస్పందంగా కన్పించారు. దీంతో పోలీసులు వారి హ్యాండ్ బ్యాగ్‌లను తనిఖీ చేయగా రూ.9.90 లక్షల నగదు బయటపడింది. తాము సమభావన సంఘం సభ్యులమని, సంఘానికి సంబంధించిన లోన్ డబ్బులు బ్యాంకు నుంచి రూ.9.90 లక్షలు డ్రా చేసుకొని వస్తున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించిన రశీదును పోలీసులకు చూపించారు. దీంతో పోలీసులు ఆ నగదును ఎన్నికల సూపరిండెంట్ ముత్తయ్యకు అప్పగించారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి నగదుకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి మహిళలకు డబ్బులు అప్పగిస్తామని ఎస్ఐ సైదులు, ఎన్నికల సూపరింటెండెంట్ ముత్తయ్య తెలిపారు.

రూ.5లక్షలు స్వాధీనం

దేవరకొండ : పట్టణంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. గుంటూరు నుంచి మన్నెవారిపల్లి వైపుకు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా జక్కుల ఆంజనేయులు అనే వ్యక్తి వద్ద ఉన్న రూ.5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగభూషణ్‌రావు తెలిపారు.